# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
22-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:216

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## 'క్లీన్ ఇమేజ్' నేతలు అవసరం!

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం పార్టీల అన్వేషణ

ముందుగానే ప్రకటించిన అధికార కాంగ్రెస్

బిజెపి, బిఆర్ఎస్ లపై ఒత్తిడి

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ ముందడుగు వేసింది. అధికార పార్టీగా తమ అభ్యర్థులను ముందుగానే ప్రకటించింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి తో పాటు భారతీయ జనతా పార్టీలో వెనుకబాటు కనిపిస్తోంది. ఆ రెండు పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి బిజెపి ఎమ్మెల్సీ టికెట్ కోసం నేతల మధ్య పోటీ నెలకొంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పేరు చుట్టూ చర్చ నడుస్తోంది.

- మిగతా 3వ పేజీలో

## మోడీ దూకుడుకు బ్రేక్!



కీలకమైన సంస్కరణలకు అడ్డు తగులుతున్న ఉద్యమాలు, నిరసనలు

జమిలి ఎన్నికలు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులకు అడ్డంకులు

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** జాతీయస్థాయిలో మోడీ దూకుడు గణనీయంగా తగ్గింది. వరుసగా విపక్షాల ఆందోళనలు, కాక్రోచ్ ఉద్యమాలతో మోడీ సర్కార్ కు ఊహించని తలనొప్పులు ఎదురయ్యాయి. పార్లమెంట్ వేదికగా దేశ చరిత్రలోనే అత్యంత కీలకమైన సంస్కరణలను పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం భారీ ఎత్తుగడలు వేసింది. కానీ ఉద్యమాలు, నిరసనల పుణ్యమా అని వాటిని అటకెక్కించింది కేంద్ర ప్రభుత్వం. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ తో పాటు దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు.. చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులపై కేంద్రం కసరత్తు దాదాపు పూర్తి చేసుకుంది. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి.. బిల్లులను ఆమోదించుకోవాలని బిజెపి వ్యూహరచన చేస్తున్న ప్రతిసారి.. దేశంలో అనూహ్యంగా అనేక రకాల ఉద్యమాలు, వివాదాలు

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో మందు జోరు..



రోజుకు రూ.100 కోట్లకు పైగానే..!

అక్టోబర్ 1 నుంచి 19 వరకు రూ.2,054.51 కోట్ల విక్రయాలు

గతేడాది కంటే 37.02 శాతం పెరిగిన అమ్మకాలు

బీర్ల విక్రయాల్లో 41 శాతానికి పైగా వృద్ధి

అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల వ్యాపారం

2లో



## పులివెందులలో నువ్వా? నేనా?!

### హోరా హోరి పోరు..

ఇరు పార్టీలకు ప్రతిష్టాత్మకమే ..జోరుగా బెట్టింగ్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ.. అందరి దృష్టి కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీ పై పడింది. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో అందరి దృష్టి పులివెందుల పైనే ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా ఆ మున్సిపాలిటీ పై వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం ముద్ర ఉంది. అటువంటి మున్సిపాలిటీ పై ఫుల్ ఫోకస్ పెట్టింది తెలుగుదేశం.




## మళ్లీ మాఫియా నీడలోకి ముంబై!

నగరంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హల్ చల్

సెలబ్రిటీలే టార్గెట్

పోలీస్ వ్యవస్థకు సవాల్

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** సెలబ్రిటీలను టార్గెట్ చేస్తోంది. గతంలో జరిగిన కాల్పు ఉదంతాలతో కాకుండా.. ఇప్పుడు నేరుగా టైగర్ ష్రాప్ పై హత్య ప్రయత్నం చేశారు. ఆయన తృటిలో తప్పించుకున్నారు. జుహు ప్రాంతంలో స్పోర్ట్స్ మైదానంలో ఫుట్బాల్ ప్రాక్టీస్ ముగించుకుని తన కారులో బయలుదేరుతున్న సమయంలో.. ఒక్కసారిగా బైక్ పై

ముంబై.. ఈ పేరు చెప్తేనే ఒకప్పుడు మాఫియా మాట వినిపించేది. మాఫియా రాజ్ లో ఉండేది. అయితే ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించడంతో ఆ ముద్ర నుంచి బయటపడింది. ప్రశాంత వాతావరణం నెలకొంది. సెలబ్రిటీలు హాయిగా తమ జీవనాన్ని గడిపేవారు. కానీ రాను రాను మళ్ళీ మాఫియా రాజ్ ప్రారంభం అవుతోంది. లారెన్స్ బిస్నోయ్ పేరుతో ఓ మాఫియా గ్యాంగ్ హల్చల్ చేస్తోంది.

## ఆస్తి మొత్తం చారిటీకే..

### రజనీకాంత్ సంచలన నిర్ణయం!

తన ఆస్తి మొత్తం చారిటీకేనని ప్రకటించిన రజనీకాంత్

మరణానంతరం ఆస్తిని రాఘవేంద్ర మండపం ట్రస్టుకు అప్పగింత

కుటుంబ సభ్యులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనని స్పష్టం చేసిన సూపర్ స్టార్

ప్రేక్షకుల వల్లే ఈ స్థాయికి వచ్చానన్న రజనీ

రజనీ నిర్ణయంపై అభిమానుల ప్రశంసల వర్షం



## పోలీసు శాఖలో ఉద్యోగాల జాతర..

మిగతా 2లో





## విజయవాడలో త్రిముఖ పోరు!

ఇండిపెండెంట్ గా మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

కూటమి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ

వైసీపీ నుంచి మాజీ మేయర్ భాగ్యలక్ష్మి

- మిగతా 2వ పేజీలో

## ఫ్రాన్స్ లో అల్లర్లు!

అంతర్జాతీయ సమాజంలో మరో రచ్చ

ముస్లింల వలసదారులే కారణమా?

ట్రంప్ వ్యాఖ్యల్లో నిజం ఎంత?



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** అంతర్జాతీయ సమాజంలో ఏదో ఒక అంశం రగులుతూనే ఉంది. తాజాగా ఫ్రాన్స్ వ్యాప్తంగా అల్లర్లు చెలరేగాయి. హింసాత్మక నిరసనలు అంతర్జాతీయంగా చర్చకు దారితీస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం, పెరిగిన నిత్యవసర ధరలు, విద్యావ్యవస్థలోని బడ్జెట్ కోతలు, ప్రభుత్వ వ్యయాలకు వ్యతిరేకంగా.. విద్యార్థులు, పౌరులు చేపడుతున్న ఆందోళనలు పక్కదారి పడుతున్నాయి. ఆస్తుల విధ్వంసంతో పాటు పోలీసులతో ఘర్షణకు దారితీస్తున్నాయి.

- మిగతా 3వ పేజీలో

## బీసీ సీఎం ఖాయం..

భవిష్యత్తులో కాంగ్రెస్ నుంచే బీసీ ముఖ్యమంత్రి వస్తారన్న మహేశ్ గౌడ్

రేవంత్ పాలనపై ప్రశంసలు.. 2039 వరకు అధికారంలో ఉంటామని ధీమా

బీసీలకు పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి

బీఆర్ఎస్‌కు ప్రశ్న.. రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్య



# మోడీ దూకుడుకు బ్రేక్!

తెరపైకి వస్తున్నాయి. ప్రభుత్వ ప్రణాళికలను దెబ్బతీస్తున్నాయి.

**అన్ని ఎన్నికలు ఒకేసారి..**

దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలి అనేది మోది సర్కార్ లక్ష్యం. అయితే జమిలీ ఎన్నికల రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తేవాలని కేంద్రం భావించిన తరుణంలోనే.. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విద్యార్థి లోకం భగ్గు మనడంతో పాటు కాంగ్రెస్ జనతా పార్టీ వంటి సంఘాలు, వామపక్ష విద్యార్థి విభాగాలు ఢిల్లీ వీధుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాయి. విద్యార్థుల ఆగ్రహం, విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్లతో దేశం అటుడుకుతున్న వేళ.. జమిలీ లాంటి సున్నితమైన రాజ్యాంగ సవరణ లను తెరపైకి తెస్తే.. రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ తగులుతుందని గ్రహించిన కేంద్ర నాయకత్వం.. అప్పట్లో ఆ బిల్లును తాత్కాలికంగా పక్కకు



పెట్టక తప్పలేదు.

**తాజాగా మరో వివాదం..**

తాజాగా మరోసారి రాజ్యాంగ సవరణ ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. ఇంతలోనే మరో వివాదం తెరపైకి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకొని.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష కూటమి మళ్లీ జంతర్ మంతర్ వేదికగా ఆందోళనలకు దిగాయి. ఓట్ల తొలగింపు, రాజ్యాంగ సంస్థల స్వయం ప్రతిపత్తి పై విపక్షాలు గగ్గోలు పెడుతున్న ఈ సంక్షోభ సమయంలో.. ఏకకాల ఎన్నికలు, డి లిమిటేషన్ బిల్లులను ప్రవేశపెడితే ఈ వ్యవహారం మరింత రచ్చకెక్కుతుంది. ప్రతిపక్షాల దాడి మరింత తీవ్రమవుతుందని భావించి కేంద్రం వ్యూహాత్మక మౌనాన్ని ఆశ్రయించింది. అయితే గతంలో ఎన్నడు ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదు ప్రధాని మోదీ. రాజకీయంగా మంచి ఫలితాలు సాధిస్తున్న.. పాలనాపరమైన సంస్కరణలకు అడుగులు వేయడంలో మాత్రం మోదీ వెనక్కి తగ్గాల్సి వస్తోంది.

# విజయవాడలో త్రిముఖ పోరు!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామం. మున్సిపల్ ఎన్నికల్లో ఒక సంచలనం. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల బరిలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వైసిపి హయాంలో డిజిపి హోదా కలిగిన వెంకటేశ్వరరావు విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. టిడిపి ప్రభుత్వానికి సన్నిహితుడు అన్న కారణంతో ఆయన సీనియారిటీని పక్కన పెట్టి.. లూప్ హోల్స్ లో పెట్టింది జగన్ సర్కార్. ఆయన పదవీ విరమణ పొందుతున్న రోజు మాత్రమే పోస్టింగ్ ఇచ్చింది. అయితే కూటమి వచ్చిన తరువాత ఏబీ వెంకటేశ్వరరావుకు రాజకీయంగా ఉన్నత పదవి ఇస్తారని అంతా భావించారు. అనుకున్న స్థాయిలో గుర్తింపు లేకపోవడంతో ఆయన ప్రభుత్వం పైన కూడా విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. సొంత రాజకీయ పార్టీ పెడతానని కూడా ఆయన ప్రకటన చేశారు. కానీ ఇప్పుడు విజయవాడ మేయర్ గా ప్రత్యక్ష ఎన్నికల్లోకి దిగుతున్నారు.

**ఇండియా కూటమి మద్దతు..**

కాంగ్రెస్ పార్టీతో పాటు వామపక్షాలు, పలు ప్రజా సంఘాలు సంయుక్తంగా మేయర్ అభ్యర్థిగా ఏబీ వెంకటేశ్వరరావును బరిలో దించుతున్నాయి. ఆయా పార్టీల ఆహ్వానం మేరకు వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు... త్వరలో మరో వ్యక్తితో కలిసి కొత్త రాజకీయ పార్టీ పెడతామని గతంలో సంకేతాలు ఇచ్చారు. అయితే ఊహించని విధంగా స్థానిక సంస్థల ఎన్నికల వేళ విజయవాడ మేయర్ అభ్యర్థిగా బరిలో దిగుతుండడం విశేషం. ఆయనకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి.

## రసవత్తరంగా పోరు..

**తాజా** ఈ పరిణామంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోరు ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. కూటమి తరుపున జనసేన నుంచి వంగవీటి రాధాకృష్ణ బరిలో దిగుతున్నారు. వైసిపి తరఫున మాజీ మేయర్ రాయనా భాగ్యలక్ష్మి పోటీ చేస్తున్నారు. ఇప్పుడు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇతర రాజకీయ పక్షాల మద్దతుతో ఇండిపెండెంట్గా బరిలో దిగుతుండడం హాట్ టాపిక్ అవుతుంది. తన నామినేషన్ దాఖలు కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు రావాలని ఏబీ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. చూడాలి ఏం జరుగుతుందో..

# మళ్లీ మాఫియా నీడలోకి ముంబై!

వచ్చిన దుండగులు ఆధ్యాత్మిక ఆయుధాలతో కారును లక్ష్యంగా చేసుకొని.. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ముంబైలో ఈ ఘటన సంచలనంగా మారింది. మళ్లీ ఆర్థిక నగరంలో మాఫియా కోరలు చాచుతున్నట్లు అర్థం అవుతోంది.

**క్షేమంగా బయటపడ్డ నటుడు..**

అయితే ముంబైలో జరిగిన ఘటనలో బాలీవుడ్ నటుడు క్షేమంగా బయటపడ్డారు. ఆయన కారు డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. రద్దీగా ఉండే ప్రాంతంలో పగటిపూట బహిరంగ ప్రదేశంలో ఇంత దారుణమైన ఘటన జరగడం ముంబై నగరంలో భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. ఈ దాడికి తామే బాధ్యులం అంటూ లారెన్స్ బిస్నోయ్ గ్యాంగ్ కు చెందిన అనిల్ పండిట్, హర్మాన్ సందు సోషల్ మీడియా వేదికగా ప్రకటించడం సంచలనంగా మారింది. వారు అంతటితో ఆగకుండా బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తో కలిసి పనిచేయకూడదని.. తమ హెచ్చరికలను లెక్కచేయనందుకే ఈ హెచ్చరిక దాడి చేశామని వారు స్పష్టం చేశారు. మా మాట వినని వారు.. సల్మాన్ తో పనిచేసిన వారు తమ తదుపరి లక్ష్యంగా మారుతారు.. వెయిట్ అండ్ వాచ్ అంటూ వారు చేసిన వ్యాఖ్యలు సినీ రంగాన్ని, సామాన్య ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**పెరుగుతున్న కదలికలు..**

ప్రస్తుతం బిస్నోయ్ గ్యాంగ్ కదలికలు మరింత పెరుగుతున్నాయి. ముంబై నగరాన్ని వనికిస్తున్నాయి. గతంలో సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్ట్మెంట్స్ వెలుపల కాల్పులు, దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద దాడి, బాబా సిద్దిఖీ హత్య ఘటనల వెనుక ఇదే నెట్వర్క్ హస్తం ఉండడంతో.. బిస్నోయ్ గ్యాంగ్ అంటేనే సినీరంగం వనికి పోతోంది. అత్యున్నత స్థాయి భద్రత, సుశిక్షితమైన క్రైమ్ బ్రాంచ్ నిఘా వ్యవస్థ ఉన్న ముంబై నగరంలో దుండగులు ఎంత తేలిగ్గా బహిరంగ కాల్పులు జరిపి పారిపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. జైలులో ఉన్న లారెన్స్ బిస్నోయ్ విదేశాల్లోనే తన అనుచరులతో కలిసి దేశవ్యాప్తంగా పక్కా స్కెచ్ లతో నేర సామ్రాజ్యాన్ని నడుపుతుంటే.. యంత్రాంగం దానిని అరికట్టడంలో ఎందుకు విఫలమవుతుందనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. పోలీసులు గట్టిగా దృష్టి సారిస్తే ఏ గ్యాంగ్ నైనా కొన్ని రోజుల్లోనే నిర్మూలించవచ్చు. కానీ గ్యాంగ్స్టర్లకు ప్రజాప్రతినిధులు, పోలీసు వర్గాలు, ఉన్నతాధికారుల్లో ఉండే అంతర్గత సంబంధాలే ఈ గ్యాంగ్ ల స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగించడానికి కారణమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ ఘటనపై మహారాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సమగ్ర విచారణకు ఆదేశించింది. 15 ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.

# పులివెందులలో నువ్వా? నేనా?!

## భారీగా బెట్టింగులు..

ఇంకో వైపు పులివెందుల ఫలితం పై భారీగా బెట్టింగులు నడుస్తున్నాయి. మెజారిటీ బెట్టింగ్ రాయులు టిడిపి వైపే మొగ్గ చూపుతున్నారు. ఆమె 15 వేల కు పైగా ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయమని పందెం కడుతున్నారు. అయితే సొంత గడ్డపై పట్టు సడలకుండా ఉండేందుకు జగన్ నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. దీనికి భిన్నంగా టిడిపి కూడా ప్రణాళికలు రచిస్తోంది. చివరకు పులివెందుల ఫలితం ఎలా ఉండబోతుందో చూడాలి.

ఎట్టి పరిస్థితుల్లో అక్కడ గెలిచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ కొట్టాలని భావిస్తోంది. అందుకు గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఖాయమని తెలుస్తోంది.

**జాగ్రత్త పడుతున్న వైసిపి..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ పట్టు కోల్పోకుండా జాగ్రత్తలు పడుతోంది. తమ పార్టీ అభ్యర్థిగా వైయస్ ప్రమీలమ్మను రంగంలోకి దించింది. ఈ మధ్య జగన్ మోహన్ రెడ్డికి సమీప బంధువు. దశాబ్దాలుగా మున్సిపాలిటీలో పట్టు నిలుపుకుంటూ వస్తున్నారు. మరోవైపు టిడిపి నుంచి గీతా కుమారి రేసులో నిలిచారు. ఆమె తరుపున సర్వశక్తులు ఒడ్డుతున్నారు బీటెక్ రవి. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ టిడిపి అభ్యర్థిని గెలిపించి.. సార్వత్రిక ఎన్నికల నాటికి అనుకూల వాతావరణం ఏర్పడేలా చేయాలన్నది బీటెక్ రవి ఆలోచన. సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి లోకేష్ ఎప్పటికప్పుడు మార్గదర్శకం చేస్తున్నారు.

**వార్డులు టిడిపికి ఏకగ్రీవం..**

కడప జిల్లాలో మిగతా చోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్దగా బరిలో దిగలేదు. పులివెందుల మున్సిపాలిటీలో సైతం ఓ 10 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై మరింత ఒత్తిడి పెరిగింది. అయితే చైర్ పర్సన్ ప్రత్యక్ష ఎన్నిక కావడంతో ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎవరు గెలుస్తారు అనేదానిపై జోరుగా చర్చ సాగుతోంది. మొత్తం 40 వార్డుల పరిధిలో 65 వేల మంది ఓటర్లు ఉన్నారు. టిడిపి అభ్యర్థి గీతా కుమారి పదిహేను వేల ఓట్ల మెజారిటీ సాధించి తన బలాన్ని నిరూపించుకుంటారని ఆ పార్టీ శ్రేణులు ధీమాతో చెబుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని కైవసం చేసుకుని సరికొత్త రాజకీయం ప్రారంభించాలని టిడిపి భావిస్తోంది.



# బీసీ సీఎం ఖాయం..

హైదరాబాద్, అక్టోబర్ 21: తెలంగాణలో బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టే అంశంపై కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ విషయంలో తొందరపాటు నిర్ణయాలు, నిర్దిష్ట గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అయితే, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నుంచే బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతుందని, వచ్చే ఎన్నికల తర్వాత కూడా ఆయన ముఖ్యమంత్రి అయినా తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

**2039 వరకు కాంగ్రెస్ పాలన?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై మహేశ్ గౌడ్ ప్రశంసలు కురిపించారు. పరిపాలనతో పాటు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం మంచి ఫలితాలు సాధిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులు కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వం 2034తోనే ఆగిపోదని, 2039 వరకు కూడా అధికారంలో ఉండగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని సమర్థించారు.

**రాహుల్ ఆలోచనతో బీసీ సీఎం నినాదం**

బీసీ వర్గానికి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రిని చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీదేనని మహేశ్ గౌడ్ వివరించారు. కాంగ్రెస్‌లో భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయో ముందుగా అంచనా వేయలేమని అన్నారు. మరోవైపు, బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిని చేసే సత్తా బీఆర్ఎస్‌కు ఉందా అని ప్రశ్నించారు. కార్పొరేషన్ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ ప్రాధాన్యం కల్పించిందని గుర్తుచేశారు.

**కొండా సురేఖ కుమార్తెపై వ్యాఖ్యలు**

మంత్రి కొండా సురేఖకు సంబంధించిన అంశంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని మహేశ్ గౌడ్ అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. బీసీ ముఖ్యమంత్రి అంశంపై స్పష్టమైన గడువు ప్రకటించకపోయినా, భవిష్యత్తులో కాంగ్రెస్ నుంచే ఆ అవకాశం ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# పోలీసు శాఖలో ఉద్యోగాల జాతర..



**హైదరాబాద్, అక్టోబర్ 21:** తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం భారీ కార్యాచరణ చేపట్టింది. పోలీసు వ్యవస్థలో ఖాళీలను దశలవారీగా భర్తీ చేసి, 2028 నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే 4,773 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తంగా 7,437 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్‌లో జరిగిన స్మారక పరేడ్‌లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను సీఎం గుర్తుచేసుకున్నారు. సమాజ భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని పోలీసు అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వారి ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని హోదాను బట్టి కోటి రూపాయలకు పైగా పెంచి నట్లు వివరించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో వి ద్య అందించేందుకు ప్రత్యేక పాఠశాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**పోలీసు నియామకాలకు గడువు**

శాఖలో సిబ్బంది కొరతను తగ్గించేందుకు నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. కానిస్టేబుల్ పోస్టులతో పాటు మిగిలిన ఖాళీలను దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 112 మంది డీఎస్పీలను నియమించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని వివరించారు.

**డ్రగ్స్, ఆహార కల్తీపై నిఘా**

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటం సమాజానికి ఆందోళన కలిగించే అంశమని సీఎం అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టేందుకు టీజీ సేఫ్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణలో ట్రాన్స్‌జెండర్లకు బాధ్యతలు అప్పగించడం సాహసోపేతమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు.

**ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు స్పష్టమైన అర్థం**

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడమంటే నేరస్థుల పట్ల మెతక వైఖరి చూపడం కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులు, సాధారణ ప్రజలు, అమాయకులకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. అదే సమయంలో డ్రగ్స్ వ్యాపారులు, భూకబ్జాదారులు, ఇతర నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

# తెలంగాణలో మందు జోరు..

విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే సమయానికి నమోదైన అమ్మకాలతో పోలిస్తే ఈసారి 37.02 శాతం పెరుగుదల కనిపించింది. పండుగ సందడి, సెలవుల నేపథ్యంలో మద్యం కొనుగోళ్లు ఊపందుకోగా.. ముఖ్యంగా బీర్ల విక్రయాలు గణనీయంగా పెరగడం ఎక్సైజ్ శాఖ గణాంకాల్లో ప్రత్యేకంగా నిలిచింది.

**బీర్ల కొనుగోళ్లలో భారీ పెరుగుదల:** ఈసారి మద్యం విక్రయాల్లో బీర్లు కీలక పాత్ర పోషించాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. ప్రస్తుత ఏడాది అదే వ్యవధిలో ఈ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరుకుంది. అంటే బీర్ల విక్రయాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. పండుగ సమయంలో బీర్లకు పెరిగిన ఆదరణ ఈ గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

**ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లోనూ వృద్ధి:** మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) విక్రయాలు కూడా గతేడాదితో పోలిస్తే పెరిగాయి. గత సంవత్సరం ఇదే 19 రోజుల వ్యవధిలో 14.16 లక్షల కేసుల మద్యం అమ్ముడవగా.. ఈసారి 18.38 లక్షల కేసులకు చేరింది. బీర్లతో పాటు ఇతర మద్యం రకాల కొనుగోళ్లు పెరగడంతో మొత్తం విక్రయాల విలువ గణనీయంగా పెరిగింది.

**మూడు రోజుల్లోనే రూ.500 కోట్లకు పైగా:** అమ్మకాల వేగం చివరి రోజుల్లో మరింత పెరిగింది. అక్టోబర్ 16 నాటికి రాష్ట్రంలో మద్యం విక్రయాల మొత్తం విలువ రూ.1,527.85 కోట్లుగా ఉంది. ఆ తర్వాత మూడు రోజుల్లోనే ఈ మొత్తం రూ.2,000 కోట్ల గీతను దాటింది. అక్టోబర్ 19న ఒక్కరోజులోనే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదయ్యాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే, పండుగ సీజన్‌లో తెలంగాణ మద్యం మార్కెట్ ఎంత వేగంగా పుంజుకుందో అర్థమవుతోంది.

# 'క్లీన్ ఇమేజ్' నేతలు అవసరం!

బలమైన అభ్యర్థుల కోసం భారత రాష్ట్ర సమితి అన్వేషిస్తుంది. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో మిగతా రెండు పార్టీల శ్రేణుల్లో ఒక రకమైన అయోమయం నెలకొంది. పార్టీ బలంతో పాటు అభ్యర్థి ఇమేజ్తో ఈ ఎన్నికలు ముడిపడి ఉన్నాయి.

**అప్పుడే ఓటర్ల నమోదు..**

అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చార్జ్ లకు బాధ్యతలు అప్పగించి.. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాలను ప్రచారంలోకి తీసుకెళ్తూ సన్నద్ధం అవుతుంది.

**బిజెపికి ప్రతిష్టాత్మకం..**

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది బిజెపి ఆలోచన. అందుకే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. హైదరాబాద్- రంగా రెడ్డి- మహబూబ్నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతర ముఖ్య నేతలు కూడా టికెట్ ఆశిస్తుండడంతో అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల పేర్లతో నివేదికలు కేంద్ర నాయకత్వానికి పంపినట్లు సమాచారం. మరోవైపు వరుస ఎన్నికల పరాజ్యాల తర్వాత పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకుని తిరిగి పుంచుకోవాలని భారత రాష్ట్ర సమితి భావిస్తోంది. అయితే విస్తృతమైన నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించగల, పట్టభద్రుల్లో మంచి గుర్తింపు ఉన్న అభ్యర్థుల కోసం ఆ పార్టీ అన్వేషిస్తుంది. క్షేత్రస్థాయిలో పట్టున్న నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అయితే అభ్యర్థుల ఎంపికలో జాప్యంతో మరింత అయోమయం నెలకొంది.




**చరిష్మ నేతల కోసం...**

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి అభ్యర్థుల విషయంలో పార్టీతో పాటు అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్ కూడా ముఖ్యం. ఎందుకంటే అక్కడ సాధారణ ఓటర్లు ఉండరు. ఉండేది పట్టభద్రులు, ఉద్యోగులు కాబట్టి వారి ఆలోచన విధానం వేరేలా ఉంటుంది. ముఖ్యంగా క్లీన్ ఇమేజ్ ఉన్న నేతలను ఎన్నుకుంటారు ఈ ఎన్నికల్లో. అందుకే అన్ని పార్టీలు మంచి ఇమేజ్ కలిగిన నాయకుల కోసం అన్వేషిస్తున్నాయి. చివరకు ఏం జరుగుతుందో చూడాలి.



## పటాన్‌చెరులో అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

### మహిషాసుర దహన కార్యక్రమంలో

### పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 22:** పటాన్‌చెరు పట్టణంలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన, శ్రీ మహంకాళి సేవా సమితి ఆధ్వర్యంలో మైత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన మహిషాసుర దహన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.దసరా పండుగను పురస్కరించుకుని పటాన్‌చెరు జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ఉన్న బుద్ధ విగ్రహం సమీపంలో ధ్వజపతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్త మార్కెట్ వద్ద షమీ పూజలు జరిపారు. ఆ తర్వాత మైత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన మహిషాసుర దహన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల రాకతో మైదానం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, పటాన్‌చెరు పెద్దలు తరతరాలుగా కొనసాగిస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భవిష్యత్ తరాలు కూడా కొనసాగించేలా కృషి చేస్తామని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు సమాజానికి గొప్ప వారసత్వమని, వాటి ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేస్తూ ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.





## మార్కండేయ నగర్‌లో వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు, చిన్నారులు, కాలనీ వాసులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో అమ్మవారి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సమక్షంలో అమ్మవారి చీరలను వేలం వేశారు. అనంతరం మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి దీక్షలో ఉన్న సభ్యులు ఉత్సవాల్లో ప్రత్యేకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొనడంతో మార్కండేయ నగర్ వీధులు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కాలనీలో ఐక్యత, భక్తిభావం వెల్లివిరిసేలా ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం అధ్యక్షుడు గద్దె కృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్, సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ, ఏర్వ సత్యనారాయణ, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్‌కుమార్, శిరందాస్ నరేందర్, ముషం నరేష్, మామిడి శెట్టి శ్రీనివాస్, గంజి విజయ్, గంజి యాదగిరి, కైరం కొండ శంకర్,నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట పవన్‌కుమార్, యాదగిరి భాస్కర్, మలేష్, కుమ్మరి నరేష్, బాలాజీ, మహేష్,లాలిప్ తో పాటు నవరాత్రి దీక్షలో ఉన్న సభ్యులు, మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## సత్తుపల్లిలో కొత్త ఆసుపత్రి.. ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**సత్తుపల్లి, అక్టోబర్ 21:** వైద్యం కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, స్థానికంగానే మెరుగైన చికిత్స అందితే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ దిశగా సత్తుపల్లి పట్టణంలో మరో వైద్య కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్డులో డాక్టర్ వినీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శస్ర హాస్పిటల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

**స్థానికంగానే మెరుగైన వైద్యం**

కొత్త ఆసుపత్రి అందుబాటులోకి రావడం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ కావడంలో ఆసుపత్రుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన చికిత్స అందాలని ఆకాంక్షించారు. వైద్యులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలందించాలని కోరారు.

**ఖర్చులు తగ్గేలా చికిత్స అందించాలి**

వైద్య పరీక్షలు, మందుల విషయంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో ప్రస్తావించారు. అవసరమైన పరీక్షలకే పరిమితమై, అనవసరమైన మందులు రాయకుండా చూడాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించినట్లుగా జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా మందుల ఖర్చును తగ్గించవచ్చనే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా స్థానిక వైద్యులు సహకరించాలని కోరారు.

**ప్రజలకు దసరా శుభాకాంక్షలు**

ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ తెలుగు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, విజయం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. కొత్త ఆసుపత్రి ప్రారంభంతో సత్తుపల్లి ప్రాంతంలో వైద్య సేవలు మరింత చేరువవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫ్రాన్స్‌లో అల్లర్లు!



అయితే ఈ ఆర్థిక, సామాజిక అంశాల ఆధారంగా మొదలైన ఉద్యమానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సరికొత్త రంగు పులిమారు. ఫ్రాన్స్ లో జరుగుతున్న ఈ ఘర్షణలకు సరిహద్దులు లేని వలసలు, ఇస్లాం వ్యాప్తి కారణమని వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అదుపుతప్పిపోతోందని.. ప్యారిస్ త్వరలోనే ముస్లిం నగరంగా మారిపోతోందని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

**అంతర్జాతీయ వ్యూహంలో భాగమే..**

అంతర్జాతీయ వ్యూహాలకు అనుగుణంగానే ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పక్కా అంతర్జాతీయ, దేశీయ రాజకీయ వ్యూహాలు దాగి ఉన్నాయి అనేది వారి మాట. యూరప్ వలస విధానాలు ఉదారంగా ఉంటాయి. ఈ విధానాలను ఎండబెట్టడం ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇది పాఠశాలల సమస్య లేదా విద్యార్థుల సమస్య కాదు. ఫ్రాన్స్ ను ఇస్లాం ఆక్రమించుకోవడానికి జరుగుతున్న కుట్ర, మాక్రోన్ ఎప్పుడో సరిహద్దులు మూసివేసి ఉండాల్సింది అని ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో ముస్లిం వలసదారులే సర్వ అనర్థాలకు మూలం అనే భావజాలాన్ని మళ్లీ నొక్కి చెప్పే ప్రయత్నాలు చేశారు.

**ప్రజాగ్రహానికి అవే కారణాలు..**

ఫ్రాన్స్ లో అల్లర్లకు కేవలం ముస్లింలను లేదా వలసదారులను మాత్రమే బాధ్యులను చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదు అనేది విశ్లేషకుల మాట. ఇది కేవలం వాస్తవాలను పక్కదోవ పట్టించడమేనని వారు చెబుతున్నారు. ఫ్రాన్స్ ఎదుర్కొంటున్న దాదాపు 119 శాతం జీడీపీ స్థాయి జాతీయ రుణం, ఐదు శాతం కంటే ఎక్కువ ఉన్న బడ్జెట్ లోటు, ద్రవ్యోల్బణం వల్ల దిగజారిన జీవన ప్రమాణాలు ఈ ప్రజాగ్రహానికి ప్రధాన కారణం. ఈ ఆర్థిక ఇబ్బందుల వల్ల రోడ్ ఎక్కిన నిరసన కారులో అన్ని వర్గాలు, విద్యార్థులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఉన్నారు. అశాంతిని ఆసరాగా చేసుకుని కొన్ని ఆకతాయి మూకలు, తీవ్రవాద ధోరణి ఉన్న ముఠాలు హింసకు, లూటీలకు పాల్పడుతున్నాయి. దానిని ఒకే మతానికి రుద్దడం సరికాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఫ్రాన్స్ లో ముస్లిం జనాభా విస్తరణ, వారు సమాజంలో భాగం లేకపోవడం వల్ల కూడా ఈ సమస్యలు వస్తున్నాయి. ప్యారిస్ శివారు ప్రాంతాల్లో పేద వర్గాలు నివసించే ప్రాంతాల్లో ప్రభుత్వం పై దశాబ్దాలుగా ఉన్న అసంతృప్తి ఈ అల్లర్లలో వేరే రూపంలో బయటపడింది.

## నేడు జరుగనున్న పండుగ సాయన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి..

### శంకర్‌పల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మైసయ్య ముదిరాజ్..

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వీరయోధుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ ప్రముఖులు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో సిఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి పండుగ సాయన్న జయంతి (అక్టోబర్ 22), వర్ధంతి (డిసెంబర్ 10)లను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఇందుకు ముదిరాజ్ సమాజం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంకుశ రజాకార్లు, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ పేదలకు అండగా నిలిచిన పండుగ సాయన్న పాలమూరు రాబిన్‌హుడ్‌గా, పేదల పెన్నిధిగా చరిత్రలో నిలిచిపోయారని తలారి మైసయ్య కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అక్టోబర్ 22న శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, సంఘం కార్యాలయ ఆవరణలో ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి ముదిరాజ్ సంఘం పెద్దలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సిఎం సమక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ బంధువులతో నిర్వహించనున్న అధికారిక జయంతి వేడుకలకు శంకర్‌పల్లి మండలం నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తలారి మైసయ్య ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సంఘం బిసి (డి) నుండి బీసీ (ఏ)గా మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంకేపల్లి యాదయ్య ముదిరాజ్, కావలి శ్రీకాంత్, ముదిరాజ్ నరేష్ ముదిరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 శుక్రవారం 22-10-2026

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గామాతకు ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

## అంగరంగ వైభవంగా అమ్మవారి శోభాయాత్ర.. రూ.1.05 లక్షలకు లడ్డూ వేలం

## అమ్మవారి చీరల వేలంతో దాదాపు రూ.10 లక్షల ఆదాయం





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దుర్గామాతకు తొమ్మిది రోజులపాటు విశేష పూజలు నిర్వహించి, విజయదశమి సందర్భంగా అమ్మవారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుర్గామాత మండపాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దుర్గామాతకు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు విజయదశమి రోజున ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అలంకరించిన చీరలను వేలం వేయగా దాదాపు రూ.10 లక్షల ఆదాయం



సమకూరింది. అదేవిధంగా తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న పవిత్ర లడ్డూను కల్వకుర్తి పట్టణానికి చెందిన వీరమల్ల రాఘవేందర్ రూ.1.05 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. బుధవారం నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా కన్నులపండువగా సాగింది. మహిళలు ప్రదర్శించిన దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురుషులు కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కేరళ కళాబృందం ప్రదర్శనలు, కోలాటాలు, బతుకమ్మ ఆటలతో శోభాయాత్రలో పండుగ సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్, కొండూరు గోవర్ధన్, బచ్చు రామకృష్ణ, కల్మిచర్ల రమేష్, గంధం ప్రసాద్, వాసా శేఖర్, చిగుల్లపల్లి శ్రీధర్, బీచని బాలకృష్ణ, కొండూరు కృష్ణయ్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




# ఎంప్లాయిస్ కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## ఆటపాటలతో అలరించిన మహిళలు..

## శమీ వృక్ష పూజ, రావణ దహనంతో పండుగ సందడి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ, విజయదశమి పండుగలను పురస్కరించుకుని కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మహిళలు తీసుకువచ్చి సామూహికంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మలను తీసుకువచ్చిన మహిళలను వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు ప్రదర్శించిన దాండియా నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పవిత్రమైన శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రావణ దహనాన్ని తిలకించేందుకు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాంప్రదాయ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సామాజిక అనుబంధాలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కాలనీవాసులందరూ కలిసికట్టుగా పండుగను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సిద్ధప్ప, బీరప్ప, మీనా ముత్యాలు, భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, సంఘ సేవకులు సీతారాం ధూళిపాల, కాంగ్రెస్ యువనేత, ఐటీ సెల్ కార్యదర్శి వాసిరెడ్డి నరేష్, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భూపతి, ఎంప్లాయిస్ కాలనీ అధ్యక్షుడు కుమ్మరి రమేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణాచార్యులు, మనోజ్, ఆవుల అశోక్, సత్యనారాయణ, అజ్మతుల్లా, గోపాల్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, సతీష్‌రెడ్డి, శుభాని, వసంత, సీనియర్ పాత్రికేయుడు తిప్పరాజు రమేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు కు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఆదర్శ్ రెడ్డి

## పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకులతో మర్యాదపూర్వక భేటీ



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21: దసరా పండుగను పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ ఉపనేత హరీష్ రావు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదర్శ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ భేటీలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పత్తికుంటలో ఘనంగా దుర్గా మాత విగ్రహాల నిమజ్జనం

## భక్తులకు తొలిసారిగా క్రేన్ సౌకర్యం.. లైటింగ్, మంచినీటి ఏర్పాట్లు

## అధికారుల పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లోని పత్తికుంట వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గా మాత విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు తొలిసారిగా క్రేన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు లైటింగ్, మంచినీటి వసతి వంటి ఏర్పాట్లు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. విగ్రహాల నిమజ్జనం సజావుగా జరిగేలా క్రేన్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం భక్తులకు ఉపయోగకరంగా మారింది. రాత్రి వేళల్లోనూ నిమజ్జన కార్యక్రమాలకు ఇబ్బందులు కలగకుండా లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈ ఏర్పాట్లను జీహెచ్ఎంసీ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎస్సీ నరేందర్‌గౌడ్ పర్యవేక్షించారు. పోలీసు శాఖ తరపున ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటేష్, ట్రాఫిక్ సీఐ బోసు తదితరులు విధులు నిర్వహిస్తూ భక్తులకు అవసరమైన సహకారం అందించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది పర్యవేక్షణ చేపట్టారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ కన్వీనర్ వై. శ్రీధర్, ఈ. వేణుగోపాల్ తదితరులు తమ బృందంతో కలిసి నిమజ్జన కేంద్రం వద్ద భక్తులకు సేవలందించారు. అధికారులు, ఉత్సవ సమితి సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో నిమజ్జన కార్యక్రమం సజావుగా కొనసాగింది. విజయదశమి సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సహకరించిన జీహెచ్ఎంసీ, పోలీసు శాఖ అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



# మాణిక్యమ కాలనీ ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. అమ్మవారి నిమజ్జనం

## భక్తిశ్రద్ధలతో పూజలు..

## వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాణిక్యమ కాలనీ చంద్రకాంత్ ముదిరాజ్, సాయి కిరణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా రోజూ అమ్మవారిని భక్తితో పూజిస్తూ ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి పూజలు సమర్పించి, సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరి, మహిత, విజయశ్రీ, లావణ్య, పవన్‌కుమార్, సుకృత, నారాయణతో పాటు భారతీయ జనతా పార్టీ గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్, ధీరజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలందరికీ దసరా, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ అమ్మవారి ఆశీస్సులతో అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# శ్రీ కోదండ రామాలయంలో వైభవంగా నవరాత్రి ముగింపు

## ఆకట్టుకున్న మహిళల కోలాటాలు, దాండియా నృత్యాలు

## హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ సంధ్యారాణి దంపతులు

**రామకృష్ణాపూర్ అక్టోబర్21(క్రైమ్ మిర్రర్):** శ్రీ కోదండ రామాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర, మహిళల కోలాటాలు, దాండియా నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాలనీకి చెందిన మహిళలు, చిన్నారులు ఒకే రంగు ఎరుపు చీరలు ధరించి లయబద్ధంగా కోలాటాలు ఆడారు. దాండియా నృత్యాలతో సందడి చేశారు. భక్తి గీతాల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి, రాజా రమేష్ దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటాలు, దాండియా ప్రదర్శనల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులను అభినందించారు. సంప్రదాయాలను, భక్తిభావాన్ని భావితరాలకు అందించేలా మహిళలు ఐక్యంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసిన పద్మశాలిపురం నాయకులు

## దసరా శుభాకాంక్షలు తెలిపిన స్థానిక నేతలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పండుగ శుభాకాంక్షలు తెలిపి, దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాశి, యాదగిరి, పున్న కృష్ణ, సిరీసల నారాయణ, బసప్ప, రాధాకృష్ణ, దొంత రాజు, ఎర్ర నవీన్ తదితర పద్మశాలిపురం నాయకులు పాల్గొన్నారు.




## పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కరవైన స్పీడు బ్రేకర్లు

## గతంలో ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి.. తాజాగా బైకులు ఢీకొని ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

## వరుస ప్రమాదాలతో ఆందోళనలో మున్సిపాలిటీ ప్రజలు

**రామకృష్ణాపూర్ అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహనాల వేగానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. కీలక ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా బుధవారం సాయంత్రం జయశంకర్ చౌరస్తా నుంచి భగత్ సింగ్ నగర్ బి-జోన్ కి వెళ్లే మార్గంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గతంలో ఇదే మార్గంలో ట్రాక్టర్ ఢీకొని ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది .ఈ వరుస ప్రమాదాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా రైల్వే స్టేషన్ రోడ్డు, ఏరియా




ఆసుపత్రి రోడ్డు, అలాగే మంచిర్యాల వైపు రాకపోకలు సాగించే ప్రధాన మార్గాల్లో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. అయినప్పటికీ, ఈ రద్దీ ప్రాంతాల్లో వేగ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో పాదచారులు,ద్విచక్ర వాహనదారులు విద్యార్థులు, రోడ్లు దాటే సమయంలో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రమాదకర కూడళ్లు, రద్దీగా ఉండే రహదారులను అధికారులు తక్షణమే గుర్తించి, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే రాత్రి సమయాల్లో స్పష్టంగా కనిపించేలా హెచ్చరిక బోర్డులు,రహదారి సూచికలు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని కట్టడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే పోలీస్, రహదారి శాఖల అధికారులు సమన్వయంతో స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మైలార్‌దేవ్‌పల్లి, మధుబన్ కాలనీల్లో ఘనంగా దసరా వేడుకలు

## జమ్మి పూజలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి.. మధుబన్ కాలనీలో రావణ దహనం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, మధుబన్ కాలనీలలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లె చెరువు వద్ద నిర్వహించిన జమ్మి పూజ కార్యక్రమంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టుకు పూజలు చేసి, ప్రజలందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం మధుబన్ కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ



ప్రాంగణంలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మన పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి వేడుకలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే పండుగల ద్వారా భావితరాలకు మన సంస్కృతి, ఆచారాలను పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు. విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, భక్తులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. పూజలు, రావణ దహన కార్యక్రమాలతో ఆయా ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది.



## మణికొండలో ఘనంగా అలాయ్ బలాయ్..

### ఆత్మీయంగా దసరా శుభాకాంక్షలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మణికొండలోని భాగ్యలక్ష్మి నివాస ప్రాంతంలో వెంకటేశ్వరరెడ్డి తన నివాసంలో విందు ఏర్పాటు చేసి అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, మిత్రులు, ఆత్మీయులు ఒకచోట చేరి పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ పండుగ సంతోషాలను పంచుకున్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. విందులో పాల్గొన్న నాయకులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగల ద్వారా ప్రజల మధ్య స్నేహసంబంధాలు, పరస్పర గౌరవం మరింత బలపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాయ్ బలాయ్ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, కులమతాలకు అతీతంగా అందరినీ ఒకచోట చేర్చి సోదరభావాన్ని పెంపొందిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఆత్మీయ కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు పరస్పర అనుబంధాలను బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు, మిత్రులు, ఆత్మీయులు పాల్గొన్నారు. అందరూ కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21:** దసరా పండుగ సందర్భంగా వెలిమెలలోని దుర్గా శంకర్ ఫంక్షన్ హాల్‌లో చీర చంద్రమౌళి ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కాల్వగడ్డ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డిని రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మిత్రులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలోని సబితా ఇంద్రారెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం అలాయ్ బలాయ్ నిర్వహించుకుంటూ పండుగ సంతోషాలను పంచుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, శుభాకాంక్షలతో శ్రీనగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, స్థానిక ప్రజల రాకతో సందడి కనిపించింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తనపై చూపిస్తున్న ఆప్యాయత, అభిమానం, సహకారం ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని అన్నారు. అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నింపాలని



ఆకాంక్షించారు. ప్రజలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, దసరా పర్వదినం సందర్భంగా తమ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజ్, జె. చిత్తారి, నోముల రాము యాదవ్, పచ్చ శ్రీనివాస్, గంజి రాజు నేత, సమ్‌రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వాసు బాబు, సునీల్, వెంకటరమణ, కొంపల్లి జగదీష్ నేత, అరుణ రెడ్డి, రామస్వామి, మోహన్, సంతోష్, నాని, మహేందర్, రిషి, కార్తీక్, బాలు, అఖిల్, శశి రాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన రామకృష్ణారెడ్డి, నాయకులు

### మణికొండలో దసరా ఉత్సవాలకు గ్రౌండ్ కేటాయింపుపై కృతజ్ఞతలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, ఇతర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మణికొండ క్రికెట్ గ్రౌండ్‌లోని మర్రిచెట్టు వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాలకు అవసరమైన మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో సహకరించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.మణికొండలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్ కేటాయింపు అవసరమైంది. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి మైదానం అందుబాటులోకి వచ్చేలా చొరవ తీసుకున్నారని రామకృష్ణారెడ్డి, నాయకులు పేర్కొన్నారు. దీంతో ఉత్సవాల నిర్వహణకు మార్గం సుగమమైందని తెలిపారు.ప్రజలు, స్థానికులు కలిసి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు సహకరించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. మణికొండలో నిర్వహించిన దసరా వేడుకల్లో స్థానికులు, నాయకులు పాల్గొని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, శ్రీరాములు, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శివగంగా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.....


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 గురువారం 22-10-2026

# పిల్లలు ఉన్నా పాఠశాల మూసివేతకు కుట్రనా?

**రఘుపల్లి ప్రభుత్వ పాఠశాలపై నిర్లక్ష్యం ఆరోపణలు!.. విధులకు దూరంగా ఉన్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి**

**కాంప్లెక్స్ హెచ్ఎం పాత్రపైనా విచారణ జరపాలి..లికుల ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య డిమాండ్**




**కాటారం, అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని కుల ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ మౌర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని రఘుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, గ్రామస్తులతో చర్చించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**విద్యార్థులు ఉన్నా బోధనకు ఆటంకాలా?**

రఘుపల్లి పాఠశాలలో విద్యార్థులు ఉన్నప్పటికీ, ఉపాధ్యాయుడు విధులకు దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని జేఏసీ పేర్కొంది. పాఠశాల నిర్వహణపై స్పష్టత లేకపోవడం, విద్యాబోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయనే ఫిర్యాదులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలలు పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యనందించే ప్రధాన ఆధారాలని, వాటిని నిర్లక్ష్యం చేయడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని పీక కిరణ్ మౌర్య అన్నారు.

**డిప్యూటేషన్‌పై వెళ్లి నెల రోజులైనా పరిష్కారం ఏది?**

సంబంధిత ఉపాధ్యాయుడు ప్రయాణ దూరం తగ్గించుకునేందుకు డిప్యూటేషన్‌పై గణపురం వెళ్లి నెల రోజులు గడిచినా, రఘుపల్లి పాఠశాలలో విద్యాబోధన కొనసాగింపుపై తగిన చర్యలు తీసుకోలేదని జేఏసీ ఆరోపించింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరింది.

**జీతాల చెల్లింపులపై విచారణ జరపాలిలి**

ఉపాధ్యాయుడి హాజరు, డిప్యూటేషన్ ఉత్తర్వులు, విధుల నిర్వహణ, జీతాల చెల్లింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని జేఏసీ డిమాండ్ చేసింది. విధులకు హాజరుకాకపోయినా జీతం చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమో కాదో అధికారులు విచారించాలని పేర్కొంది. ఈ వ్యవహారంలో కాంప్లెక్స్ హెచ్ఎం పాత్రపైనా సమగ్ర విచారణ జరిపి, తప్పిదాలు నిర్ధారణ అయితే సంబంధిత బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించం**

రఘుపల్లి ప్రభుత్వ పాఠశాల మూతపడకుండా చూడాలని, విద్యార్థులకు నిరంతర విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టాలని కోరింది. పేద పిల్లల విద్యాహక్కును పరిరక్షించడంలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పీక కిరణ్ మౌర్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు

ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కో-కన్వీనర్ అయిత బాపు, అక్కల బాపు యాదవ్, మహేష్, విలాసాగరం రవి, దుర్గం అజయ్, కోట అశోక్, దుర్గం మహేష్, మనోజ్ గోమాస, విజయ్, అనపర్తి మహేష్, దుర్గం శ్యాంరాజ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



## విశ్వనాథ ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు

**వైభవంగా సిందూరోత్సవం.. మేళతాళాల నడుమ దుర్గామాత నిమజ్జనం**

**మంచిర్యాల అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్):** జిల్లా కేంద్రంలోని ముఖరం చౌరస్తా వద్ద ఉన్న శ్రీ విశ్వనాథ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిందూరోత్సవం వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం నుంచే సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న మహిళలు దుర్గామాతకు ప్రత్యేక పూజలు, మంగళహారతులు సమర్పించారు. అమ్మవారికి సింధూరం సమర్పించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఒకరికొకరు సింధూరం పూసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. మంగళహారతుల పాటలు, భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సిందూరోత్సవంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై దుర్గామాత విగ్రహాన్ని మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. వచ్చే ఏడాది కూడా అమ్మవారు తిరిగి రావాలని, తమ కుటుంబాలను చల్లగా చూడాలని భక్తులు ప్రార్థిస్తూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు బోడ ధర్మేందర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## కట్టేదాన్‌లో నిరుపయోగంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

**ప్రజలకు ఉపయోగపడే ప్రాంతానికి మార్చాలి..**

**లిఫ్ట్ మరమ్మతులు, పరిశుభ్రతపై దృష్టి సారించాలి**






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మౌలిక సదుపాయాలు నిర్వహణ లోపాలతో నిరుపయోగంగా మారుతున్నాయని తెలంగాణ రక్షణ సేన నాయకుడు తిమ్మప్ప కురుమ ఆవేదన వ్యక్తం చేశారు. కట్టేదాన్ ప్రాంతంలోని జీహెచ్ఎంసీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌వేర్ కేంద్రం ప్రజలకు ఆశించిన స్థాయిలో ఉపయోగపడటం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం వినియోగం ఒక శాతం కూడా లేదని తిమ్మప్ప కురుమ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన కేంద్రం వినియోగంలోకి రాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం వినియోగంపై అధికారులు సమీక్షించి, ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే మరో ప్రాంతానికి మార్చాలని కోరారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్ మూసివేసి ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, నడవడానికి ఇబ్బందులు పడే వారికి లిఫ్ట్ అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మరోవైపు బ్రిడ్జి పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, లిఫ్ట్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన సదుపాయాలు నిరుపయోగంగా మారకుండా చూడాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని తిమ్మప్ప కురుమ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## భారతీనగర్‌లో ఘనంగా దసరా వేడుకలు.. రావణాసుర దహనం







**వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు..**

**పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా జమ్మి పూజలు, రావణాసుర దహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఓల్డ్ ఎంఐజీ కాలనీలో జమ్మి పూజలు నిర్వహించిన అనంతరం, ఎల్ఐజీ సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో రావణాసుర దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేడుకలకు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక ప్రజలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.

శ్రీరామచంద్రుని విజయానికి ప్రతీకగా నిర్వహించిన రావణాసుర దహనం వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, ఆదర్శ్ రెడ్డి కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, అవినాష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, ఐలేష్ యాదవ్, కాలనీ సొసైటీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జై భీమ్ వర్సెస్ జై శ్రీరామ్!

**హత్నూరలో వేడెక్కిన రాజకీయాలు**

**దసరా వేడుకల్లో వివాదం.. రవాణా దహనంపై పరస్పర ఆరోపణలు**

**దళిత సర్పంచ్ నల్లోళ్ల ఎల్లయ్యకు అవమానం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు**

**రాముడిని అవమానించేలా మాట్లాడారంటూ బీజేపీ, హిందూ సంఘాల నిరసన**

**సర్పంచ్‌కు మద్దతుగా స్థానికులు, దళిత సంఘాల యువకుల ర్యాలీ**





**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21:** సంగారెడ్డి జిల్లా హత్నూరలో దసరా పండుగ సందర్భంగా చోటుచేసుకున్న వివాదం రాజకీయంగా వేడెక్కింది. జై భీమ్, జై శ్రీరామ్ నినాదాలతో ఇరు వర్గాలు రోడ్డెక్కడం, పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దసరా వేడుకల్లో రవాణా దహనం విషయంలో వివాదం మొదలైనట్లు తెలుస్తోంది. దసరా వేడుకల్లో తనకు అవమానం జరిగిందని, తనను కార్యక్రమానికి దూరంగా ఉంచారని ఆరోపిస్తూ హత్నూర సర్పంచ్ నల్లోళ్ల ఎల్లయ్య తన అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దళిత సర్పంచ్ పట్ల కుల వివక్షతో వ్యవహరించారని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పిలిచినా తాను రానని సర్పంచ్ చెప్పినట్లు పేర్కొంటూ కార్యక్రమ నిర్వాహకుడు ప్రవీణ్ ఓ ఆడియోను గ్రూపులో పెట్టినట్లు తెలుస్తోంది. ఈ ఆడియో వైరల్ కావడంతో వివాదం మరింత ముదిరింది. ఆడియోలో రాముడిని అవమానించేలా మాట్లాడారంటూ బీజేపీ నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రోడ్డుపై నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాను హిందువునేనని, రాముడిని అవమానించేలా ఎక్కడా మాట్లాడలేదని సర్పంచ్ నల్లోళ్ల ఎల్లయ్య స్పష్టం చేసినట్లు సమాచారం. తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఇదంతా తనపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు దళిత సర్పంచ్‌పై వివక్షతో కూడిన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తూ దళిత సంఘాలు, యువకులు ఎల్లయ్యకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. దప్పుల చప్పుళ్లతో రోడ్డుపై ప్రదర్శన చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఉద్రిక్తత పెరిగినట్లు సమాచారం. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ వివాదానికి సంబంధించి ఇరువర్గాల ఆరోపణలు, ఆడియోలోని పూర్తి వివరాలు, పోలీసుల దర్యాప్తులో తేలే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.